# క్రమబద్ధీకరణకు ఒక్క రోజే..

- అదనపు లోడుకు ముగుస్తున్న గడువు
- 50 శాతం రాయితీ ప్రకటన
- నేడు దరఖాస్తు చేస్తేనే సబ్సిడీ



**రాజమహేంద్రవరం రూరల్:** విద్యుత్ అదనపు లోడు క్రమబద్ధీకరణకు ఇచ్చిన గడువు సోమవారంతో ముగియనుంది. రెండు నెలల క్రితం ఈ అవకాశాన్ని వినియోగదారులకు ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్) కల్పించగా, ఒక్కరోజే గడువు ఉండడంతో దరఖాస్తు చేసుకోనివారు ఇప్పటికైనా సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. అదనపు లోడు భారంతో బాధపడుతున్న వారంతా ఈ అవకాశం వినియోగించుకుంటే అదనపు చార్జీల బెడద ఉండదని చెబుతున్నారు. రాజమహేంద్రవరం సిటీ, రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గ పరిధిలో 3.50 లక్షలకు పైగా కనెక్షన్లు ఉన్నట్టు అధికారిక గణాంకాలు వెల్లడిస్తున్నాయి. వీటి పరిధిలోని వినియోగదారుల్లో 50 శాతానికి మించి.. కనెక్షన్ తీసుకున్న సమయంలో చూపించిన వినియోగం కన్నా ఇప్పుడు అధికంగానే విద్యుత్ వినియోగిస్తున్నారు. ఈ నేపథ్యంలో వారికి ఉపశమనం కలిగించేందుకు అదనపు లోడు క్రమబద్ధీకరణకు ఈపీడీసీఎల్ దరఖాస్తులు ఆహ్వానించింది. దీనిలో 70 శాతానికి పైగా దరఖాస్తులు మాత్రమే వచ్చినట్టు సమాచారం.

**పెరుగుతున్న వినియోగం**

రోజురోజుకూ విద్యుత్ వినియోగం పెరిగిపోతోంది. సాధారణంగా కనెక్షన్ ఇచ్చేటప్పుడు కిలోవాట్ విద్యుత్ వినియోగానికి గృహాలకు రూ.2 వేలు, దుకాణాలకు రూ.2,500 చొప్పున వసూలు చేస్తారు. చాలామంది గృహ వినియోగదారులు ఈ మొత్తానికి సంబంధించి ఒకటి నుంచి రెండు కిలో వాట్ లోపలే చూపిస్తారు. వినియోగంలో మాత్రం అంతకు రెట్టింపు కేటగిరీలో చేరిపోతున్నారు. వాణిజ్య కనెక్షన్లకు సంబంధించిన వినియోగమైతే, చూపించిన దానికన్నా ఏకంగా నాలుగింతలు ఉంటోంది. ఇటువంటి వారంతా అదనపు లోడు క్రమబద్ధీకరణ చేసుకోవాల్సిన అవసరం ఉంటుందని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

**సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించాలి**

ప్రతి అదనపు కిలో వాట్‌కు సెక్యూరిటీ డిపాజిట్‌గా రూ.200గా నిర్ణయించారు. ఇదే సమయంలో డెవలప్‌మెంట్ చార్జీ రూ.1,500 చెల్లించాల్సి ఉంటుంది. కిలో వాట్లు పెరిగేకొద్దీ ఈ రుసుం మారుతుంది.

**గతంలో జరిమానాలు**

ఇప్పటివరకు అధికలోడు నియంత్రణలో భాగంగా అధికారులు, సిబ్బంది తరచూ ఇంటింటికీ వెళ్లి తనిఖీలు చేసేవారు. అధికలోడు వినియోగిస్తున్న వారిని గుర్తించి, రుసుముతో పాటు జరిమానా వసూలు చేసేవారు. ఐదేళ్లుగా ప్రతి నెలా సబ్‌స్టేషన్ పరిధిలో తమకు కేటాయించిన లక్ష్యాల మేరకు రీడింగ్‌లు తనిఖీ చేసి, అధిక లోడు వినియోగిస్తున్న వారికి జరిమానాలు విధిస్తున్నారు.

దరఖాస్తుల స్వీకరణ మార్చి ఒకటిన ప్రారంభం కాగా, సోమవారంతో ముగుస్తుంది. కిలో వాట్ల చొప్పున డెవలప్‌మెంట్ చార్జీల్లో 50 శాతం రాయితీ లభిస్తుంది.

**సద్వినియోగం చేసుకోవాలి**

**అదనపు విద్యుత్ లోడు క్రమబద్ధీకరణకు ఇచ్చిన** అవకాశం సద్వినియోగం చేసుకోవాలి. అదనపు రుసుము, జరిమానా బెడద ఉండకూడదంటే తప్పనిసరిగా క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోవాలి. ఒక్కరోజే గడువు ఉన్నందున వెంటనే దరఖాస్తు చేయాలి.

– నక్కపల్లి శామ్యూల్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, ఏపీఈపీడీసీఎల్(ఆపరేషన్స్), రాజమండ్రి

**తీరనున్న లోవోల్టేజీ సమస్య**

గృహాలు, దుకాణాలకు విద్యుత్ కనెక్షన్లు తీసుకునే సమయంలో దీపాలు, ఇతర గృహోపకరణాల వినియోగాన్ని సగటున అంచనా వేసి, లోడ్లు కిలో వాట్లలో లెక్కించి, సెక్యూరిటీ డిపాజిట్, డెవలప్‌మెంట్ చార్జీలు వేస్తారు. అధిక శాతం మంది గృహాలకైతే 1–2 కిలోవాట్లు, దుకాణాలకు 2–3 కిలో వాట్లకు మాత్రమే అనుమతి తీసుకుంటారు. ఈ లెక్క ప్రకారమే ఆయా ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తారు. పట్టణీకరణ, ఇంట్లో అవసరాలు పెరగడం, దుకాణాలకు సంబంధించి వ్యాపార లావాదేవీలు పెరగడం, వాతావరణ పరిస్థితుల వల్ల అనుమతి తీసుకున్న దానికన్నా అధికంగా విద్యుత్ వినియోగం జరుగుతోంది. వినియోగం అంచనాలకు మించడంతో నియంత్రణలపై లోడు ఎక్కువై, తరుచూ ట్రిప్ కావడం వల్ల లోవోల్టేజీ సమస్యలు పెరిగిపోతున్నాయి. తాజా చర్యల వల్ల లోవోల్టేజీ సమస్య కూడా తీరుతుందని అధికారులు చెబుతున్నారు.

## క్లుప్తంగా

### మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి పరామర్శ



వెంకటరామారావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జక్కంపూడి రాజా తదితరులు

**కడియం:** మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా ఆదివారం మండలంలోని బుర్రిలంకలో రత్నం వెంకటరామారావు కుటుంబాన్ని పరామర్శించారు. వెంకటరామారావు మృతికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఆయన వెంట కడియపు సావరం మాజీ సర్పంచ్ సాపిరెడ్డి సూరిబాబు, నాయకులు రత్నం శ్రీకృష్ణ, తాడాల రమణ, పులగం చిట్టిబాబు, నాగిరెడ్డి చిన్ని, కొత్తపల్లి నాగు, రంబాల దుర్గయ్య, దాసరి రాము తదితరులు ఉన్నారు.

### విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

**ప్రకాశం నగర్:** ఏపీఈపీడీసీఎల్ 11 కేవీ గోదావరి సబ్ స్టేషన్ భాస్కర్ నగర్ పరిధిలోని ఆర్ట్స్ కళాశాల వద్ద విద్యుత్ లైన్ల పనుల కోసం సోమవారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు సంస్థ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.శామ్యూల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు ఆర్ట్స్ కళాశాల, హోమియోపతి ఆసుపత్రి, ఆర్అండ్‌బీ అతిథి గృహం, ఎస్పీ బంగ్లా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు.

### 'చలో రాజానగరం'లో స్వల్ప మార్పు

**ప్రకాశం నగర్:** జూలై ఒకటిన చేపట్టిన చలో రాజానగరం కార్యక్రమంలో స్వల్ప మార్పులు జరిగినట్టు కార్యక్రమ జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్లు వాసంశెట్టి గంగధార్, బాక్స్ ప్రసాద్ ఒక ప్రకటనతో తెలిపారు. మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన నేపథ్యంలో పోలీసుల సూచనల మేరకు రవాణా వాహనాల బంద్ నిర్ణయాన్ని తాత్కాలికంగా వాయిదా వేశామని చెప్పారు. కొద్దిమంది కార్మిక సంఘాల నాయకులతో కలిసి, రాజానగరం వెళ్లి సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళతామన్నారు.

### నేడు సర్టిఫికెట్ల పరిశీలన

**రాజమహేంద్రవరం రూరల్:** పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాల కోసం సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరుకాని అభ్యర్థులకు అవకాశం కల్పించినట్టు ప్రిన్సిపాల్ వి.నాగేశ్వరరావు తెలిపారు. బొమ్మూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం సర్టిఫికెట్ల పరిశీలన అనంతరం ధ్రువీకరణ పత్రం అందజేస్తారన్నారు. అలాగే 90,001 ర్యాంకు నుంచి చివరి ర్యాంకు వరకు అభ్యర్థులు పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశాలకు ఆప్షన్లు ఎంపిక చేసుకోవచ్చని తెలిపారు.

### పశ్చిమ డెల్టాకు నీటి విడుదల తగ్గింపు



నిడదవోలు వద్ద పశ్చిమ డెల్టా ప్రధాన కాలువ

**నిడదవోలు:** రైతుల వ్యవసాయ అవసరాల నిమిత్తం జలవనరుల శాఖ ధవళేశ్వరం హెడ్‌వర్క్స్ అధికారులు పశ్చిమ డెల్టా ప్రధాన కాలువకు నీటి విడుదలను క్రమబద్ధీకరిస్తున్నారు. నాలుగు రోజులుగా విస్తారంగా వర్షాలు కురవడంతో విజ్జేశ్వరం హెడ్‌స్లూయిజ్ నుంచి ఆదివారం 5,500 క్యూసెక్కుల గోదావరి జలాలను తగ్గించి కాలువలకు విడుదల చేస్తున్నారు. పశ్చిమ డెల్టా పరిధిలో ఉప కాలువలకు నీటి విడుదలను అధికారులు తగ్గించారు. నరసాపురం కాలువకు 1,912 క్యూసెక్కులు, తణుకు కాలువకు 606, ఏలూరు కాలువకు 888, ఉండి కాలువకు 1,087 అత్తిలి కాలువకు 402 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు.

## జోరందుకున్న మొక్కల ఎగుమతులు



కడియం నర్సరీల నుంచి మొక్కలు ఎగుమతి చేస్తున్న కూలీలు

**కడియం:** ఇతర రాష్ట్రాల్లో వర్షాలు పడుతుండడంతో కడియం ప్రాంత నర్సరీల నుంచి మొక్కల ఎగుమతులు జోరందుకున్నాయి. మొక్కల కొనుగోలుదారులు, రైతులు ఇక్కడి నర్సరీలకు తరలివస్తున్నారు. దీంతో దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాలకు మొక్కల ఎగుమతులు విస్తృతంగా సాగుతున్నాయి. రోజుకు 200కు పైగా లారీల్లో అవెన్యూ, ఆర్నమెంట్, ఫ్రూట్ వెరైటీ మొక్కల ఎగుమతులు జరుగుతున్నాయని స్థానిక నర్సరీ రైతులు తెలిపారు. ఎగుమతుల సీజన్ ప్రారంభం కావడంతో కూలీలకు డిమాండ్ ఏర్పడింది. దీంతో కడియం మండలంలోని వివిధ గ్రామాల నుంచే కాక, చుట్టుపక్కల మండలాల నుంచి సైతం ఎగుమతి కూలీలు ఇక్కడికి చేరుకుంటున్నారు. మండలంలోని కడియపులంక కేంద్రగా ఉదయం మొక్కల ఎగుమతులకు వాహనాలు బయలుదేరుతాయి. దీంతో ఉదయం కడియపులంక జాతీయ రహదారి వెంబడి రద్దీ ఏర్పడుతోంది.

## ఫ్లై ఓవర్‌పై తప్పని ఇసుక ఇక్కట్లు



మోరంపూడి ఫ్లై ఓవర్‌పై ఇసుక



హుకుంపేట జాతీయ రహదారిపై..

**రాజమహేంద్రవరం రూరల్:** మోరంపూడి ఫ్లై ఓవర్‌పై ఇసుక ఇక్కట్లు తప్పడం లేదు. ధవళేశ్వరం గాయత్రి ర్యాంపు నుంచి ఇసుక లారీలు నిబంధనలు పాటించకుండా రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో బొమ్మూరు నుంచి లాలాచెరువు వైపు వెళ్లే లారీల నుంచి ఇసుక జాతీయ రహదారిపై, మోరంపూడి ఫ్లై ఓవర్‌పై పడుతుంది. దీనివలన వాహనచోదకులు జారిపడి, గాయాల పాలవుతున్నారు. ఇప్పటికైనా రవాణా, పోలీసు, రెవెన్యూ అధికారులు ఇసుక లారీలపై కొరడా ఝుళిపించాలని వాహనచోదకులు కోరుతున్నారు.

## గుండెపోటుతో ఈఈ శ్రీధర్‌వర్మ కన్నుమూత



దాట్ల శ్రీధర్‌వర్మ (ఫైల్)

**రాజమహేంద్రవరం రూరల్:** ఏపీఈపీడీసీఎల్ (ఆపరేషన్స్) రాజమహేంద్రవరం రూరల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ దాట్ల శ్రీధర్‌వర్మ(60) శనివారం అర్ధరాత్రి గుండెపోటుతో కన్నుమూశారు. మూడు నెలలుగా అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్నారు. శనివారం అర్ధరాత్రి గుండెపోటు రావడంతో అక్కడికక్కడే కుప్పకూలారు. ఆయనకు భార్య కనకదుర్గ, తల్లిదండ్రులు, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ ఏడాది డిసెంబర్‌లో ఆయన ఉద్యోగ విరమణ చేయనున్నారు. విధి నిర్వహణలో శ్రీధర్‌వర్మ అంకితభావంతో పనిచేయడంతో పాటు, చిన్న, పెద్ద అని తేడాలేకుండా చిరునవ్వుతో ప్రతి ఒక్కరినీ అప్యాయంగా పలకరించేవారని ఉద్యోగులు భావోద్వేగానికి గురయ్యారు. బొమ్మూరు గ్రామంలో సంతాన సీతారామాలయం నిర్మాణంలో శ్రీధరవర్మ కీలకపాత్ర పోషించారు. విద్యుత్ శాఖ ఓసీ ఉద్యోగుల సంఘ రాష్ట్ర అధ్యక్షునిగా శ్రీధర్‌వర్మ సేవలందిస్తున్నారు.



శ్రీధర్‌వర్మ భౌతికకాయం వద్ద కుటుంబ సభ్యులు

**భౌతికకాయానికి పలువురి నివాళి**

రాజమహేంద్రవరం వేంకటేశ్వరనగర్‌లోని శ్రీధర్‌వర్మ నివాసంలో ఆయన భౌతికకాయాన్ని పలువురు అధికారులు సందర్శించి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. సీపీడీసీఎల్ (ప్రాజెక్ట్సు అండ్ హెచ్ఆర్) డైరెక్టర్ టీవీఎస్ఎన్ మూర్తి, తూర్పుగోదావరి, కోనసీమ, విశాఖ ఎస్ఈలు తిలక్‌కుమార్, రాజబాబు, శ్యాంబాబు, విశ్రాంత సీజీఎం వైఎస్ఎన్ ప్రసాద్, విశ్రాంత ఎస్ఈ చింతా సత్యనారాయణరెడ్డి, రాజమండ్రి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నక్కపల్లి శామ్యూల్, విద్యుత్ ఉద్యోగులు ఓసీ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు, డీఈలు, ఏడీఈలు, ఏఈలు, ఉద్యోగులు శ్రీధర్‌వర్మకు నివాళులర్పించారు. అనంతరం శ్రీధర్‌వర్మ అంత్యక్రియలను కోటిలింగాలరేవులోని శ్మశానవాటికలో నిర్వహించారు.

## ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు సేవలు అభినందనీయం

**రాజమహేంద్రవరం రూరల్:** డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ వి.నాగేశ్వరరావు కళాశాలకు అందించిన సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. ఆదివారం బొమ్మూరులోని జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు సోమవారం ఉద్యోగ విరమణ సందర్భంగా సన్మాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పాలిటెక్నిక్ కళాశాలల ప్రిన్సిపాళ్లు ప్రసాద్, సుబ్రహ్మణ్యం, శంకరరావు మాట్లాడుతూ, ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు 36 ఏళ్లుగా సాంకేతిక విద్యా శాఖలో పలు హోదాల్లో విధులు నిర్వహించి, ఎనిమిదేళ్లుగా బొమ్మూరు పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్‌గా కాలేజీ అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. కళాశాలకు ఈసీఏకు ఈ ఏడాది ఎన్‌బీఏ గ్రేడ్‌ను తీసుకురావడంతో పాటు, పాలిటెక్నిక్ బాలుర స్పోర్ట్స్ మీట్‌లను విజయవంతంగా నిర్వహించారన్నారు. మెకానికల్ హెడ్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎ.మురళి మాట్లాడుతూ, ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు కళాశాల అభివృద్ధికి చేసిన కృషి అభినందనీయమన్నారు. ఈ కళాశాలలో చదివిన విద్యార్థులకు అత్యధిక ప్లేస్‌మెంట్లు తీసుకువచ్చిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు మాట్లాడుతూ, ఎనిమిదేళ్లుగా ప్రిన్సిపాల్‌గా బాధ్యతలను అందరి సహకారంతో విజయవంతంగా నిర్వహించానన్నారు. ప్రతి ఒక్కరికీ పేరుపేరున కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు, వరలక్ష్మి దంపతులను పూలమాలలు, శాలువాలు, జ్ఞాపికలతో కళాశాల స్టాఫ్, నాన్ టీచింగ్ స్టాఫ్, కుటుంబ సభ్యులు, పూర్వ విద్యార్థులు, స్నేహితులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల హెడ్‌లు మురళీకృష్ణ, వి.శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ పి.మహేశ్వరరావు, హాస్టల్ సూపరింటెండెంట్ జయకుమార్, సీనియర్ లెక్చరర్లు, లెక్చరర్లు పాల్గొన్నారు.



ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు దంపతులను సత్కరిస్తున్న వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్లు, హెడ్‌లు

## ఆర్ట్స్ కళాశాల విద్యార్థులకు ర్యాంకులు



ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

**కంబాలచెరువు:** పీజీ సెట్‌లో ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు ర్యాంకులు సాధించారని ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కే ఆదివారం తెలిపారు. 200 మంది పైగా విద్యార్థులు ర్యాంకులు సాధించడం గర్వకారణమన్నారు. 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి నిర్వహించిన పీజీ ప్రవేశ పరీక్షలైన ఏపీ ఐసెట్, ఏపీపీజీ సెట్, సీయూ సెట్, ఏపీ ఎడ్‌సెట్‌ల్లో తమ విద్యార్థులు ర్యాంకులు సాధించి కళాశాలకు వన్నె తెచ్చారన్నారు. ఈ విజయానికి వేసవి సెలవులలో ప్రత్యేకంగా నిర్వహించిన పీజీ కోచింగ్ తరగతులు, అధ్యాపకుల నిబద్ధతే కారణమన్నారు. గణిత విభాగానికి చెందిన ఎస్.కొమాళి రాష్ట్రస్థాయి మూడో ర్యాంకు సాధించిందన్నారు. ఈ సందర్భంగా ఆదివారం ఏర్పాటు చేసిన అభినందన సభలో విద్యార్థులను కళాశాల అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

## అశాస్త్రీయ భావజాలంతో సమాజానికి చేటు

**కంబాలచెరువు:** సైన్స్ ఫలితాలు సామాన్యుల వద్దకు చేరకపోవడానికి సమాజంలో రాజ్యమేలుతున్న అశాస్త్రీయ భావజాలమే కారణమని పలువురు వక్తలు అన్నారు. జన విజ్ఞాన వేదిక జిల్లా కార్యవర్గ సమావేశం ఆదివారం స్థానిక దానవాయిపేటలోని ప్రదీప్ డయాబెటిస్ ఆసుపత్రి వద్ద జరిగింది. ఈ సందర్భంగా జనవిజ్ఞాన వేదిక సభ్యత్వ క్యాంపెయిన్ పోస్టర్‌ను జిల్లా నాయకులు ఎస్.రవిబాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవిజ్ఞాన వేదిక గత 38 ఏళ్లుగా తెలుగు ప్రజలతో స్నేహ సంబంధాలు కొనసాగిస్తూ, ప్రజలు శాస్త్రీయంగా ఆలోచించాలని, మానవత్వంతో జీవించాలని ఆకాంక్షిస్తూ శాస్త్ర ప్రచారంతో ప్రజలను చైతన్యవంతం చేస్తోందన్నారు. విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంచడానికి ఉచిత వేసవి శిక్షణ శిబిరాలు, చెకుముకి సైన్స్ పరీక్షలు, సెమినార్లు నిర్వహిస్తుందన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కె.భీమయ్య మాట్లాడుతూ జీవుల జన్యు నిర్మాణం, వచ్చే రోగాలను, వాటి చికిత్సలపై ఎంతో ముందుకు వెళ్లామని చెప్పారు. సైన్స్ ఇప్పటికీ పాఠ్య గ్రంథాల్లో ఉంది మినహా జీవన విధానంగా మారలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంఘ కోశాధికారి జి.తాతారావు, జిల్లా నాయకులు డాక్టర్ సి.ప్రదీప్, ఏఎన్ సుధారాణి, కె.రంగవల్లి, బీఎస్‌వీ ప్రసాదరావు, సీహెచ్ నిశ్చల్, కేవీ గణేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## జూలై 22న ఏఐఎఫ్‌టీయూ మహాసభ



కాపవరంలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

**బిక్కవోలు:** ఏఐఎఫ్‌టీయూ (అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య) ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా మహాసభ వచ్చే నెల 22వ తేదీన పిఠాపురంలో జరుగుతుందని సమాఖ్య జిల్లా అధ్యక్షుడు వల్లూరి రాజబాబు తెలిపారు. ఈ మహాసభను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఆదివారం మండలంలోని కాపవరం గ్రామంలోని మహాసభ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కార్మికోద్యమ చరిత్రలో అఖిల భారత కార్మిక సంఘాల ఆవిర్భావం 1991లో జరిగిందన్నారు. నాటి నుంచి నేటి వరకు దేశవ్యాప్తంగా సంఘటిత, అసంఘటిత రంగాల్లో కార్మికులను ఐక్యం చేస్తూ, కార్మికుల సమస్యలపై వీరోచితంగా పోరాడుతుందన్నారు. జిల్లాలో భవన నిర్మాణ కార్మికులు, క్వారీ, సామిల్లు, పారిశుధ్య, ఇంటి పనివారు, మోటార్ తదితర రంగాల కార్మికులతో యూనియన్ల నిర్మాణాల్లో ఏఐఎఫ్‌టీయూ కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మడికి సత్యం, జట్టు లోవరాజు, కొల్లు రాంబాబు, బత్తిన సుబ్బారావు, కర్రి భారతమ్మ, డోకుబుర్ర మరియమ్మ, దుర్గాదేవి తదితరులు పాల్గొన్నారు.

## విద్యాసంస్థలకు నోటీసులు

**కోరుకొండ:** రోడ్డు భద్రత నియమాలను పాటించాలని విద్యాసంస్థల బస్సు డ్రైవర్లు, యాజమాన్యానికి నోటీసులు అందజేసినట్టు కోరుకొండ ఎస్సై కూన నాగరాజు తెలిపారు. డ్రైవర్లకు లైసెన్స్‌లు, విద్యాసంస్థల బస్సులకు ఫిట్‌నెస్ ఉండాలన్నారు. బస్సులకు సీబుక్, ఆర్‌సీ బుక్, ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్, పొల్యూషన్ సర్టిఫికెట్లు ఉండాలన్నారు. ప్రతి బస్సుకు క్లీనర్లు తప్పనిసరిగా ఉండాలని చెప్పారు. బస్సులు బయలుదేరే ముందు వాహనాలను పూర్తిగా పరిశీలించాలని, బస్సులోని పిల్లలు సురక్షితంగా ఉన్నారనేది గమనించాలని స్పష్టం చేశారు. డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్‌లో మాట్లాడరాదని చెప్పారు. రెడ్ సిగ్నల్ వద్ద ఆపకపోవడం నేరమన్నారు. ఆయా భద్రతా నియమాలను నోటీసులో పేర్కొన్నట్టు తెలిపారు.

## సినిమాలు

| | |
|---|---|
| శ్యామల | : మార్గన్ |
| సూర్య మినీ | : ఎఫ్–1 ది మూవీ |
| సూర్య ప్యాలెస్ | : కన్నప్ప |
| స్వామి | : కుబేర |
| అనుశ్రీ | : కన్నప్ప |
| శివజ్యోతి | : కుబేర |
| రాజా | : కన్నప్ప |
| ఊర్వశి | : 8వసంతాలు |
| మేనక | : చంద్రేశ్వర, హనుమాన్ జంక్షన్ |
| రంభ | : మా |
| అప్సర | : కన్నప్ప |
| అశోక | : కన్నప్ప |
| **నామవరం** | |
| వీఎస్ మహల్ | : కన్నప్ప |
| **ధవళేశ్వరం** | |
| మురళీకృష్ణ | : కన్నప్ప |
| **కడియం:** | |
| వెంకటసూర్య | : కన్నప్ప |

## ఆకాశ దీపిక



ఏ చిత్రకారుడి కుంచె నుంచి జాలువారిన పెయింటింగ్ కాదిది. ఆకాశమే కాన్వాస్‌గా ప్రకృతి గీసిన చిత్రమిది. తూర్పున ఉదయించే భానుడు ఎంతో ప్రశాంతంగా దర్శనమిస్తాడు. అదే పడమర వైపు అస్తమించే సమయంలో ఆకాశాన ఎర్రటి కాంతులతో ప్రజ్వరిల్లుతాడు. రాజానగరం–అనపర్తి రోడ్డులో ఆదివారం సాయంత్రం పసుపు, ఎరుపు వర్ణాలతో శోభాయమానంగా దర్శనమిచ్చిన ఈ దృశ్యం చూపరులను ఆకట్టుకుంది. – రాజానగరం

## కాలువ పూడికతీతకు అవాంతరాలు



టీపీ స్కీమ్ కాలువలో పొక్లెయిన్‌తో చేస్తున్న పూడికతీత

**సీతానగరం:** మండలంలోని పురుషోత్తపట్నంలో ఉన్న తొర్రిగెడ్డ పంపింగ్ స్కీమ్ కుడి కాలువ పూడికతీత పనులకు సీతానగరంలో పలు అవాంతరాలు ఏర్పడుతున్నాయని టీపీ స్కీమ్ చిన కొండేపూడి నీటి సంఘం అధ్యక్షుడు కోనే శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం సీతానగరం ఏటిగట్టును ఆనుకుని ఉన్న తొర్రిగెడ్డ పంపింగ్ స్కీమ్ కాలువ పూడికతీత పనులకు పొక్లెయిన్ కాలువలోకి దిగడానికి మార్గం లేకుండా పోయింది. ఏటిగట్టును ఆనుకుని టీపీ స్కీమ్ కాలువ ఇరువైపులా కొన్నేళ్లుగా ఆక్రమించుకుని, ఇళ్లు నిర్మించుకున్నారు. దీనిపై శ్రీనివాస్ విలేకరులతో మాట్లాడుతూ, కాలువ ఇరువైపులా ఆక్రమణల వల్ల పొక్లెయిన్ దిగడానికి అవకాశం లేదన్నారు. స్థానికులు కాలువ దాటడానికి సిమెంట్ స్తంభాలు అడ్డుగా వేశారని, ఇళ్లకు విద్యుత్ సర్వీసుల వైర్లు, పంచాయతీ అందించే తాగునీటి పైపులైన్లు అడ్డుగా ఉన్నాయని చెప్పారు. వీటిని మినహాయించి, మిగిలిన కాలువ పూడికతీత పనులు నిర్వహిస్తున్నట్టు వివరించారు.